# కాంగ్రెస్ పార్టీపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కందుకూరి రమేశ్

ఉట్నూర్, నవంబర్ 1 : రాష్ట్రంలో హింసాత్మక రాజకీయ చర్యలకు దిగుతున్న కాంగ్రెస్ పార్టీపై చర్యలకు పోలీస్ శాఖకు రెఫర్ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కందుకూరి రమేశ్ బుధవారం మండల కేంద్రంలో ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఇతర పార్టీలకు ప్రజలు ఆదరణ లేకపోవడంతో బీఆర్ఎస్ అభ్యర్థులపై కాంగ్రెస్ పార్టీ కక్ష కట్టిందన్నారు. ఇందులో భాగంగానే ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని హత్యాయత్నం చేశారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వారిని శిక్షించేటట్లు ప్రతిపాదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు రషీద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, సీనియర్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, మర్సుకోల తిరుపతి, మహేందర్, సత్తన్న, వాసు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలి

- ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 1: ప్రస్తుత శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 30వ తేదీన చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల విధులకు సంబంధించిన నియమ నిబంధనలతో కూడిన పూర్తి మెటీరియల్‌ను అందించడం జరిగిందని, బాధ్యతతో జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదని అన్నారు. పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్‌బుక్, ఇతర సామగ్రిని పరిశీలించి శిక్షణ సిబ్బందికి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శిక్షణ తరగతులను శ్రద్ధగా విని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను ఉదయం ఆరు గంటలకు చేపట్టాలని సూచించారు. మాక్ పోల్ నిర్వహించిన తర్వాత తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ మొత్తం క్లియర్ చేసుకోవాలని, పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలను అన్ని విధాలుగా సరి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ నిర్వహిస్తున్నందున ప్రతి అంశం రికార్డింగ్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు పీవో, ఏపీవోలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేస్తా..ఆదరించండి

- ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్



దస్తురాబాద్ : నినాదాలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

దస్తురాబాద్, నవంబర్ 1 : బీఆర్ఎస్ పార్టీ వెంటే తమ ఉంటామని నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గొడిసేర్యాల గొండు గూడెం(జీ) గ్రామ పంచాయతీ పరిధిలోని మున్యాల గొండు గూడెం ఆదివాసులు తేల్చి చెప్పారు. మున్యాల గొండు గూడెంలో బుధవారం ఖానాపూర్ నియోజవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పర్యటించారు. ఆయనను డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ అనుమతి లేక బీటీ రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, అలాగే విద్యుత్ సౌకర్యం లేదని, అంగన్‌వాడీ కేంద్రం కావాలని భూక్యా జాన్సన్ నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. కాగా గెలిచిన తరువాత 6 నెలల లోపు సమస్యలు అన్ని పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని గూడెం ఆదివాసీలు హామీ ఇచ్చి, ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, సర్పంచ్ శంకర్, ఉపసర్పంచ్ సీడాం రాజు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రామడుగు రమేశ్ రావు, సంతపూరి శ్రీనివాస్, సీడాం భీంరావ్, నిమ్మతోట శివయ్య, దాసరి సుధాకర్, బొమ్మెన గోపి, విలాస్ యాదవ్, శంకర్ గౌడ్, సాయి, గ్రామ పటేల్, ఆదివాసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇంద్రవెల్లి, నవంబర్ 1 : ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీబీఐచే విచారణ చేయించాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అమ్జద్, వైస్ ఎంపీపీ గోపాల్ సింగ్, ఎంపీటీసీలు కోవ రాజేశ్వర్, మడావి భీంరావ్, సర్పంచ్ జాదవ్ లఖన్, మండల కోఆప్షన్ సభ్యుడు మిర్జా జిలాని బేగ్, మాజీఎంపీపీ కనక తుకారాం, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫియాన్, మండల ఉపాధ్యక్షుడు రాందాస్, నాయకులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ టికెట్ లంబాడీలకు ఇవ్వాలి



జిల్లా ఇన్‌చార్జికి వినతిపత్రం ఇస్తున్న రాథోడ్ చారులత

ఉట్నూర్, నవంబర్ 1: ఖానాపూర్ టికెట్ లంబాడా సమాజానికి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, జడ్పీటీసీ రాథోడ్ చారులత బుధవారం ఉట్నూర్‌లో జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాశ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖానాపూర్‌లో లంబాడా సమాజానికి టికెట్ కేటాయించాల్సిన ఉండగా ఇతర అభ్యర్థికి కేటాయించారన్నారు. ప్రస్తుతం ప్రకటించిన వెడ్మా బొజ్జు అనర్హుడన్నారు. రాయ్‌పూర్ నిబంధన ప్రకారం టికెట్ కేటాయించాలన్నారు. అధిష్ఠానంతో చర్చించి అర్హులకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి

బోథ్, నవంబర్ 1 : బోథ్ శాసన సభ ఎన్నికల ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ కోరారు. బుధవారం బోథ్‌లోని ఆర్‌వో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున ర్యాలీలు, సమావేశాలు, తదితర వాటి కోసం 48 గంటలు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. వాహనాలు, మైకుసెట్ల ద్వారా ప్రచారం చేయాలన్న అనుమతి తప్పని సరి అన్నారు. ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుభాష్ చందర్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌వో చాహత్ బాజ్‌పాయ్

## కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీ చైర్మన్ రాజీనామా



మాట్లాడుతున్న ఆదివాసీ చైర్మన్ రాథోడ్ గంగాధర్

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 1 : సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ చైర్మన్ రాథోడ్ గంగాధర్‌తో పాటు 30 మంది రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సిరికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం చేస్తున్నామన్నారు. కానీ తమకు పార్టీ కార్యక్రమంలో ఏవిధమైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఖానాపూర్ నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎడ్మా బొజ్జు కనీసం ఫోన్ చేస్తే కూడా ఎత్తడం లేదని పేర్కొన్నారు. తాము కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని రాజీనామా చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గణేశ్, భీంరావ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

## జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 1 : నిర్మల్ జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా బేస్‌బాల్ జిల్లా అధ్యక్షుడు పొందు సుధాకర్, జేవీఎన్ఆర్ ప్రిన్సిపాల్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడా పోటీలలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 11,12 తేదీల్లో నిర్మల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన వారు వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కే భోజన్న, ఎస్జీఎఫ్ సెక్రటరీ రమణరావు, మాజీ ఎస్జీఎఫ్ ఎం శ్రీనివాస్, నెట్‌బాల్ జాయింట్ సెక్రటరీ జమున, బ్యాడ్మింటన్ కార్యదర్శి వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆవుదూడలపై పెద్దపులి పంజా

భీంపూర్, నవంబర్ 1 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం తాంసి(కే) శివారు అటవీప్రాంతంలో బుధవారం పెద్ద పులి రెండు ఆవుదూడలపై దాడిచేయగా, తీవ్రంగా గాయపడ్డాయి. తాంసి(కే) కు చెందిన గుగ్గిరాల మురళికి చెందినవి. అక్టోబర్ 24న ఇదే ప్రాంతంలో ఒక ఆవుదూడను పులి చంపేసింది. ఇదిలాఉంటే అటవీశాఖ అధికారులు అక్కడ పులి సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నారు. పులి దాడిలో మృతిచెందిన పశువుల తాలూకు యజమానులకు పరిహారాలు ఇప్పిస్తామని అధికారులు చెప్తున్నారు.